నేడు కేటీఆర్ రోడ్ షో

మేడ్చల్, మే3 (నమస్తే తెలంగాణ): మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో శనివారం నిర్వహించే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రోడ్ షోలకు పార్టీ శ్రేణులు అన్ని ఏర్పాట్లు చేశారు. మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా కేటీఆర్ రోడ్ షోలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శనివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని షాపూర్‌నగర్ చౌరస్తా, మల్కాజిగిరి నియోజకవర్గంలోని అల్వాల్, మేడ్చల్ నియోజకవర్గంలోని మేడ్చల్‌లో కేటీఆర్ రోడ్ షోలు నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి ఎమ్మెల్యేలు చామకూర మల్లారెడ్డి, కేపీ.వివేకానంద్, మర్రి రాజశేఖర్ రెడ్డి ఏర్పాట్లు చేస్తున్నారు. రోడ్‌షోకు బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలి రానున్నారు.

బాల భవన్.. దాహం దాహం

జూబ్లీహిల్స్, మే 3 : నాంపల్లి పబ్లిక్ గార్డెన్‌లోని జవహర్ బాలభవన్‌లో గత వారం రోజులుగా శిక్షణ కార్యక్రమాలు జరుగుతున్నాయి. అయితే శుక్రవారం చిన్నారులు మంచినీరు లేక అల్లాడిపోయారు. ఈ విషయమై తల్లిదండ్రులు బాలభవన్ అధికారులను ప్రశ్నించగా.. మేమేం చేయాలని సమాధానం ఇచ్చారు.

బీఆర్ఎస్ పార్టీకే చేవెళ్ల జై..!

- చేవెళ్లలో హ్యాట్రిక్ విజయం బీఆర్ఎస్‌దేనంటున్న ఓటర్లు
- గత రెండు లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయ దుందుభి
- ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో గులాబీ గాలులు
- కాంగ్రెస్, బీజేపీలకు ఓటమి తప్పదంటున్న ఓటర్లు
- చేవెళ్ల లోక్‌సభ మొత్తం **29,39,057** ఓట్లు
- 2019లో పోలైన **53.25** శాతం ఓట్లలో.. **40.62** శాతం ఓట్లతో బీఆర్ఎస్ గెలుపు
- 2014లో పోలైన **60.51** శాతం ఓట్లలో.. **33.1** శాతంతో గులాబీ రెపరెపలు
- ఈసారి హ్యాట్రిక్ పక్కా అంటున్న జనం

చేవెళ్ల లోక్‌సభ స్వరూపం..!

మొత్తం ఓటర్లు	-29,39,057
పురుషులు	-14,92,799
స్త్రీలు	-14,22,401
ట్రాన్స్‌జెండర్స్	-277

చేవెళ్ల లోక్‌సభ ఎన్నికల్లో గులాబీ దుందుబి ఇలా..!

2014 లోక్‌సభ బరిలో..!

పార్టీ	పోలైన ఓట్లు	శాతం
బీఆర్ఎస్	4,35,077	33.1
కాంగ్రెస్	3,62,054	27.8
టీడీపీ కూటమి	3,53,203	26.8
పోలైన ఓటు	13,22,312	60.51 శాతం

2019 లోక్‌సభ బరిలో..!

పార్టీ	పోలైన ఓట్లు	శాతం
బీఆర్ఎస్	5,28,148	40.62
బీజేపీ	2,01,960	15.53
కాంగ్రెస్	5,13,831	39.5
పోలైన ఓట్లు	13,00,998	53.25 శాతం

సిటీబ్యూరో, మే 3 (నమస్తే తెలంగాణ) : చేవెళ్ల.. ఈ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీకి లోక్ సభ ఎన్నికల్లో కంచుకోటగా ఉంది. రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ఇక్కడ జరిగిన రెండు లోక్ సభ ఎన్నికల్లోనూ చేవెళ్ల ప్రజలు గులాబీ పార్టీకే జై కొట్టారు. అభ్యర్థులు ఎవరున్నా.. కేవలం బీఆర్ఎస్ పార్టీని చూసి జనం ఓట్లు వేసి ఓటర్లు తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఇప్పుడు మళ్లీ హ్యాట్రిక్ విజయం అందించి రికార్డు సృష్టించడానికి సిద్ధంగా ఉన్నామంటూ చేవెళ్ల ప్రజలు నినదిస్తున్నారు. 2014, 2019లో చేవెళ్ల లోక్‌సభ బరిలో కాంగ్రెస్, బీజేపీలను మట్టి కరిపించి గులాబీ జెండా రెపరెపలాడింది. తొలుత 2014లో బీఆర్ఎస్ నుంచి కొండా విశ్వేశ్వర్ రెడ్డి గెలుపొందారు. అతను పార్టీకి రాజీనామా చేసి మళ్లీ 2019లో కాంగ్రెస్ తరపున బరిలో దిగారు. ఆ సమయంలో కొండా విశ్వేశ్వర్ రెడ్డికి ప్రజలు ఓట్లతో జవాబు చెప్పారు. బీఆర్ఎస్ నుంచి బరిలో ఉన్న రంజిత్ రెడ్డిని గెలిపించి గులాబీ పార్టీ దమ్ము చూపించారు. అప్పటి వరకు కొండా విశ్వేశ్వర్ రెడ్డి తన వ్యక్తిగత ఇమేజ్‌ని చూసి మొదటిసారి గెలిచానని భ్రమలో ఉన్న అతడికి చేవెళ్ల ప్రజలు చురకలు పెట్టారు. ఇదే క్రమంలో ఇప్పుడు జరిగే లోక్‌సభ ఎన్నికల్లో రంజిత్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ నుంచి బరిలో ఉన్నారు. రంజిత్ రెడ్డి కూడా కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాదిరిగానే ఓటమి రుచి చూసేందుకు సిద్ధంగా ఉండాలని చేవెళ్ల ప్రజలు చర్చించుకుంటున్నారు. చేవెళ్ల నుంచి బీసీ నాయకుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ బీఆర్ఎస్ నుంచి బరిలో ఉన్నారు. ఇప్పటికే అన్ని వర్గాల నుంచి అతడికి ఆదరణ లభించింది. చేవెళ్ల లోక్‌సభ విస్తరించి ఉన్న ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, చేవెళ్ల, పరిగి, తాండూర్, వికారాబాద్‌లో గులాబీ గాలులు బలంగా వీస్తున్నాయి. దీనికి తోడు చేవెళ్ల లోక్‌సభ బీఆర్ఎస్ కంచుకోటగా ఉండటం.. రెండుసార్లు బీఆర్ఎస్ జెండా ఎగిరిన ప్రాంతం కావడంతో కాసాని గెలుపు ఖాయంగా కనిపిస్తున్నదని రాజకీయ నిపుణులు సైతం విశ్లేషిస్తున్నారు.

అభివృద్ధిని చూసి ఓట్లేయండి..

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, పద్మారావుగౌడ్



ఎల్లమ్మ సన్నిధిలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్

అమీర్‌పేట, మే 3 : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే నగరాన్ని అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దారని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. మౌలిక వసతుల కల్పన, శాంతి భద్రతల నిర్వహణ, ఐటీ రంగం పురోగతి, రహదారుల విస్తరణ, విద్యుత్, రవాణా, పచ్చదనం, వరదనీటి కాలువల విస్తరణ, మంచినీటి, డ్రైనేజీ వ్యవస్థలను తీర్చి దిద్దడంలో గత ప్రభుత్వం పనిచేసిన తీరును ప్రజలు అర్థం చేసుకున్నారన్నారు. అందుకే గ్రేటర్ పరిధిలో బీఆర్ఎస్ అభ్యర్థులకు ప్రజలు పెద్దపీట వేశారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధిని పరిగణలోకి తీసుకుని ఓటర్లు బీఆర్ఎస్‌కు మద్దతుగా నిలవాలని కోరారు. నియోజకవర్గానికి ఎంపీగా ఎంతో చేసే అవకాశమున్నా, ఏమీ చేయలేకపోయిన బీజేపీ అభ్యర్థి జి.కిషన్‌రెడ్డి వైఖరిని, కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజలే ఎండగడుతున్నారన్నారు. సికింద్రాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి టి.పద్మారావుగౌడ్‌కు మద్దతుగా శుక్రవారం ఉదయం అమీర్‌పేట్‌లోని సుప్రభాత్‌నగర్ నుంచి పాదయాత్ర ప్రారంభించారు. ముందుగా బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారిని దర్శించుకున్న పద్మారావుగౌడ్, తలసాని శ్రీనివాస్‌యాదవ్ డివిజన్‌లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. మహిళలు మంగళహారతులు పడుతూ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వెంకట్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ ఎన్.శేషుకుమారి, డివిజన్ అధ్యక్షుడు ఎం.హనుమంతరావు, నాయకులు అశోక్‌యాదవ్, కరుణాకర్‌రెడ్డి, కూతురు నర్సింహ, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీలో చేరిన బీఎస్పీ నాయకులకు గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

కాంగ్రెస్, బీజేపీలకు ఓటుతో బుద్ధి చెప్పాలి

ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరికలు

కవాడిగూడ, మే 3 : కాంగ్రెస్, బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలతో విసుగుచెందుతున్న ప్రజలు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు స్వచ్ఛందంగా బీఆర్ఎస్‌లో చేరుతూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు సంపూర్ణ మద్దతునిస్తున్నారని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు ఓటుతో తగిన బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. శుక్రవారం భోలక్‌పూర్ డివిజన్‌లోని ఇందిరానగర్‌లో డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో బీఎస్పీకి చెందిన సీనియర్ నాయకులు కేఎల్ సత్యనారాయణ, భాస్కర్, వెంకటరమణ, సుక్క బాలనర్సింహ, నర్సింగ్‌రావు తదితరులు ఎమ్మెల్యే ముఠా గోపాల్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులను ఇబ్బందులకు గురిచేసేందుకు బీజేపీ, కాంగ్రెస్ నేతలు కుమ్మక్కై అక్రమంగా కేసులు పెడుతూ ప్రచారం నిర్వహించకుండా అడ్డుపడుతున్నారని ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల్లో సికింద్రాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి టి.పద్మారావు గౌడ్ ఘన విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు ముఠా జైసింహ, పార్టీ సీనియర్ నాయకుడు రెబ్బ రామారావు, బింగి నవీన్ కుమార్, మైనారిటీ నాయకులు షరీపోద్దీన్, ఎ.శంకర్ గౌడ్, రహీం, జునేద్ బాగ్దాది, ఆర్.శ్రీనివాస్, రాజా దీన్ దయాల్ రెడ్డి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌పార్టీకి పాలన చేతకాదు

రోడ్ షోలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

రోడ్‌షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, లక్ష్మారెడ్డి కుమార్తె మౌనికరెడ్డి, కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి

బాలానగర్ , మే 3 : మల్కాజిగిరి బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గెలుపు కోసం బాలానగర్ డివిజన్‌లో చేపట్టిన రోడ్ షోకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. బాలానగర్‌లో వాడవాడలా గులాబీ జెండాలు దర్శనమిచ్చాయి. వేలాదిమంది గులాబీ శ్రేణులు గులాబీ కండువాలు బుజాన వేసుకొని జై కేసీఆర్, జైజై కేసీఆర్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. శుక్రవారం డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన రోడ్ షోకు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మల్కాజిగిరి బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి కుమార్తె మౌనికరెడ్డి హాజరయ్యారు. ఆడపడుచులు వారికి బొట్టుపెట్టి హారతులిచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మౌనిక రెడ్డి బతుకమ్మను ఎత్తుకొని కార్యకర్తలను ఉత్తేజ పరిచారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి పరిపాలన చేతగాదని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి చెందిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ ఆధ్వర్యంలోనే హైదరాబాద్ నగరాన్ని అత్యంత అద్భుతంగా తీర్చిదిద్దినట్లు పేర్కొన్నారు. యావత్ తెలంగాణ వ్యాప్తంగా 24 గంటల పాటు నిరంతరం విద్యుత్ సరఫరా చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతర విద్యుత్ సరఫరా చేయడంలో విఫలమైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మందడి సుధాకర్‌రెడ్డి, పంజా రాంచందర్, ఎండీ కాజా, కరుణాకర్ రెడ్డి, నర్రా దేవేందర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్ ముదిరాజ్, బాజిని నాగేందర్, బీఆర్ఎస్ శ్రేణులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఢిల్లీ నేతల చేతిలో రిమోట్ కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు

వారి మాటలు నమ్మి మరోసారి మోసపోవద్దు

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా ఎమ్మెల్యే వివేకానంద్ ప్రచారం

కళాపతినగర్‌లో ప్రచారంలో పాల్గొన్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే వివేకానంద్,కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ

దుండిగల్, మే 3 : ఢిల్లీ నేతల చేతిలో రిమోట్‌గా ఉన్న కాంగ్రెస్, బీజేపీ నేతల మాటలు నమ్మి మరోసారి మోసపోవద్దని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని, అందుకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. శుక్రవారం సూరారం డివిజన్ పరిధిలోని విశ్వకర్మ కాలనీ, కళావతినగర్‌లోని మహమ్మదీయ మజీద్ గల్లిలో ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణతో కలిసి ఇంటింటికి తిరుగుతూ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. రాష్ట్రంలోని మైనార్టీల సంక్షేమం, అభివృద్ధి కోసం పాటుపడే ఏకైక పార్టీ బీఆర్ఎస్ మాత్రమేనని అన్నారు. గత పదేండ్లలో జరిగిన అభివృద్ధిని గమనించి ఓటు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు భాస్కర్, విశ్వకర్మ కాలనీ ప్రెసిడెంట్ శ్రీనివాస్ రెడ్డి, మన్నె బాలేశ్ ముదిరాజ్, జీవన్‌రెడ్డి, శివగుప్త, దొడ్ల శ్రీనివాస్, సదానందం, జిలానిపాష, మల్లేశ్, డివిజన్ మహిళా అధ్యక్షురాలు హేమలత రెడ్డి, అమృత, లావణ్య, సుభద్ర, జయశ్రీ, షెహనాజ్‌బేగం, రాణి, ధనలక్ష్మి, వెంకటమ్మ, మైనార్టీ నేతలు షేక్‌మహ్మద్, అమీర్‌ఖాన్, మక్సూద్‌అలీ, మొయజుద్దీన్, సిద్దికి, ఫిరోజ్, డా.హుస్సేన్, సాజిద్, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

అటవీ అధికారులకు శిక్షణ పూర్తి

స్నాతకోత్సవంలో పాల్గొన్న ప్రముఖులు

కుత్బుల్లాపూర్, మే 3 : తెలంగాణ అటవీ శాఖలో శిక్షణ పూర్తి చేసుకున్న అధికారులు ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయిలో సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కోవాలని తెలంగాణ అటవీ దళాల అధిపతి ఆర్.ఎం.డోబ్రియాల్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అటవీ అకాడమీ దూలపల్లిలో 9వ బ్యాచ్ అటవీ క్షేత్రాధికారుల ప్రవేశ శిక్షణ కార్యక్రమ స్నాతకోత్సవం జరిగింది. ముఖ్యఅతిథులుగా ఆర్.ఎం.డోబ్రియాల్‌తో పాటు గుజరాత్ రాష్ట్ర అటవీ దళాల అధిపతి యూడీ.సింగ్ హాజరయ్యారు. 2022 నవంబర్ 4న ప్రారంభమైన 18 నెలల శిక్షణ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. ఈ శిక్షణలో మొత్తం 47మంది శిక్షణాధికారులు ఉన్నారు. వీరిలో 11మంది మహిళా అధికారులుండగా గుజరాత్‌కు చెందిన సురేశ్‌కుమార్ దేశాయ్ బ్యాచ్ మొత్తంలో అత్యుత్తమ ప్రతిభను కనబర్చి 7 బంగారు పథకాలు సాధించారు. రోసక్ కేవడియా 6 బంగారు పథకాలు, 3 వెండి పథకాలు, పార్థ్‌కుమార్ భిమాని, జనక్‌రామ్ కకాడియా, మనీశ్‌కుమార్ పటేల్ ఒక్కొక్కరు రెండు చొప్పున పథకాలు, జిగ్నేశ్‌భాయ్ మేనియా, సుమన్‌మీనా, మిలన్‌సోలంకి, కథమ్‌పటేల్, భార్గవ్ పిపాలియా ఒక్కొక్కరు బంగారు పథకాన్ని సాధించారు. ఈ కార్యక్రమంలో అటవీ సంరక్షణాధికారి ఎల్యూసింగ్ మేరు, అకాడమీ సంచాలకులు ఎస్.జె అషాతో పాటు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

17 నుంచి ఐజీబీసీ గ్రీన్ ప్రాపర్టీ షో

జూబ్లీహిల్స్, మే 3 : నగరంలోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఈనెల 17, 18, 19 తేదీలలో సీఐఐ ఐజీబీసీ గ్రీన్ ప్రాపర్టీ షో 2వ ఎడిషన్‌ను నిర్వహించనున్నట్లు నేషనల్ వైస్ చైర్మన్ సి.శేఖర్ రెడ్డి, హైదరాబాద్ చాప్టర్ కో చైర్మన్ జి.శ్రీనివాస మూర్తి శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రాన్ని పర్యావరణ పద్ధతుల్లో అగ్రగామిగా నిలిపేందుకు మూడురోజులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లో 884 గ్రీన్ రెసిడెన్షియల్ ప్రాజెక్ట్‌లుగా మారుతున్నాయని పేర్కొన్నారు. ఐజీబీసీ ధ్రువీకరించబడిన 1.13 బిలియన్ చదరపు అడుగుల గ్రీన్ బిల్డింగ్ స్థలం, వనరుల పరిరక్షణ ప్రభావంపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఐజీబీసీ, తెలంగాణ ప్రభుత్వం సంయుక్తాధ్వర్యంలో ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు గ్రీన్ రెసిడెన్షియల్ ప్రాజెక్ట్‌లతో ప్రదర్శన నిర్వహించనున్నట్లు వివరించారు.

సెలెక్ట్ మొబైల్స్‌లో మెగా సేల్

జూబ్లీహిల్స్, మే 3 : ప్రముఖ రిటైల్ సంస్థ సెలెక్ట్ మొబైల్స్ 6వ వార్షికోత్సవం సందర్భంగా మే 3 నుంచి జూన్ 4వ తేదీ వరకు మెగాసేల్ ఆఫర్లను ప్రకటించింది. ఈ ఆఫర్లలో భాగంగా కస్టమర్ కొనుగోలు చేసిన ప్రతి మొబైల్‌పై ఒక గిఫ్ట్‌ను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అంతేగాకుండా స్మార్ట్‌ఫోన్ కొనుగోలుపై స్పెషల్ ఆఫర్ అందిస్తున్నట్లు సంస్థ సీఎండీ వై.గురు తెలిపారు. శుక్రవారం నగరంలోని స్టోర్‌లలో ఆఫర్‌లను ప్రారంభించారు. మొబైల్ కొనుగోలుపై స్మార్ట్ టీవీ, కూలర్, ఫ్రంట్‌లోడ్ వాషింగ్ మిషిన్ లాంటి అద్భుతమైన గిఫ్ట్స్ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. బ్రాండెడ్ స్మార్ట్ ఫోన్ల కొనుగోలుపై 60శాతం డిస్కౌంట్, స్మార్ట్ ఎల్ఈడీ టీవీలు కొనుగోలుపై 50శాతం డిస్కౌంట్, ఎస్‌బీఐ కార్డ్‌పై 7.5 శాతం డిస్కౌంట్, బజాజ్ ఫైనాన్స్ ద్వారా కొనుగోలుపై రూ.4 వేల క్యాష్‌బ్యాక్, ఎల్ఈడీ స్టార్ టీవీ అండ్ సౌండ్ బార్‌కాంబో కేవలం రూ.10,990, బ్రాండెడ్ అల్టా కాలింగ్ వాచ్ కేవలం రూ.999, బ్రాండెడ్ యాక్ససరీస్ కాంబోస్ రూ.899 నుంచి అందుబాటులో ఉండనున్నట్లు తెలిపారు. ఈ ఆఫర్లు అన్ని సెలెక్ట్ మొబైల్ స్టోర్‌లలో అందుబాటులో ఉంటాయని సంస్థ సీఎండీ వై.గురు పేర్కొన్నారు.

వంద కోట్లు ఇస్తే పార్టీ మారుతా

బీజేపీ కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి

కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి

వంద కోట్లు తీసుకొని పార్టీ మారారా..?

వంగా వ్యాఖ్యలపై ప్రజల్లో మొదలైన చర్చ

మన్సూరాబాద్, మే 3: వంద కోట్లు ఇస్తే తానుకూడా పార్టీ మారుతానంటూ ఓ బీజేపీ కార్పొరేటర్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. జిల్లా అధ్యక్షుడి సమక్షంలోనే బాహాటంగా సదరు కార్పొరేటర్ చేసిన వ్యాఖ్యల పట్ల బీజేపీ కార్యకర్తలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరగా.. అతడిపై బీజేపీ కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి పరోక్షంగా విమర్శలు చేశాడు. శుక్రవారం ఎల్బీనగర్, చంద్రపురికాలనీలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో రంగారెడ్డి జిల్లా అర్బన్ బీజేపీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి అధ్యక్షతన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ డివిజన్ల కార్పొరేటర్లు కొప్పుల నర్సింహా రెడ్డి, వంగా మధుసూదన్‌రెడ్డి, రంగా నర్సింహా గుప్త, మొద్దు లచ్చిరెడ్డి, పవన్‌కుమార్, బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, కళ్లెం నవజీవన్‌రెడ్డి పాల్గొన్నారు. అయితే వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరిక విషయంపై కొందరు విలేకరులు ప్రశ్నించారు. ఎల్బీనగర్ నియోజకవర్గానికి చెందిన మరి కొందరు బీజేపీ కార్పొరేటర్లు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారని తెలుస్తుందని ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు చంపాపేట డివిజన్ కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి స్పందించారు. తనకు కూడా వంద కోట్లు ఇస్తే పార్టీ మారుతానంటూ సమాధానం ఇచ్చాడు. అయితే వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి వంద కోట్లు తీసుకొని కాంగ్రెస్ పార్టీలో చేరారా..? అంటూ పలువురు చర్చించుకుంటున్నారు.

జేబీఐఈటీలో ప్లేస్‌మెంట్ డే

ప్లేస్‌మెంట్ డేలో వివిధ కంపెనీల సీఈఓలతో వర్క ఫోర్స్ డెవలప్‌మెంట్ హైదరాబాద్ డైరెక్టర్ భాస్కర్, జేబీ విద్యా సంస్థల కార్యదర్శి జేవీ కృష్ణారావు

మొయినాబాద్, మే 3 : సాంకేతిక నైపుణ్యం ఉన్న విద్యార్థులకు ప్రముఖ కంపెనీల్లో మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని వర్క ఫోర్స్ డెవలప్‌మెంట్ హైదరాబాద్ డైరెక్టర్ భాస్కర్ గందవాడ అన్నారు. మండల పరిధిలోని అమ్డాపూర్ కూడలిలో ఉన్న జేబీఐఈటీలో శుక్రవారం ప్లేస్‌మెంట్ డే నిర్వహించారు. ప్లేస్‌మెంట్ డేలో వివిధ కంపెనీలు పాల్గొని విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపికైన వారికి నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జేవీ విద్యాసంస్థల కార్యదర్శి జేబీ కృష్ణారావు, కళాశాల ప్రిన్సిపల్ పీసీ కృష్ణమాచారి, తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న వడదెబ్బ ముప్పు

గ్రేటర్ వ్యాప్తంగా తీవ్ర స్థాయి ఉష్ణోగ్రతలు నమోదవ్వడం, దానికి తోడు తేమ శాతం పడిపోవడంతో వడగాల్పులు వీచే అవకాశం ఉన్నట్లు వాతావరణ కేంద్రం అధికారులు ఎల్లో హెచ్చరికలు జారీచేశారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రజలు ఉదయం 11 నుంచి సాయంత్రం 4గంటల మధ్య అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని సూచిస్తున్నారు.

సిటీబ్యూరో, మే 3 (నమస్తే తెలంగాణ) : నగర వేసవి కాల చరిత్రలో శుక్రవారం కొత్త రికార్డు నమోదైంది. గతంలో ఎన్నడూ లేని విధంగా పగటి ఉష్ణోగ్రతలు 43డిగ్రీలు దాటి నమోదవ్వడంతో జనం అతలాకుతలమయ్యారు. భానుడు ప్రచ్ఛండ భానుడిగా మారడంతో గ్రేటర్ అగ్నిగుండంగా మారింది. రోజురోజుకు గ్రేటర్ వాతావరణం ఊహించని రీతిలో మార్పు చెందుతూ తీవ్ర రూపం దాల్చుతున్నది. నగర చరిత్రలోనే ఇప్పటి వరకు పగటి ఉష్ణోగ్రతలు 43డిగ్రీలు దాటి నమోదవ్వలేదంటున్నారు వాతావరణ కేంద్రం అధికారులు. కరోనాకు ముందు గ్రేటర్‌లో 2015, 2018, 2019లో పలు మార్లు పగటి ఉష్ణోగ్రతలు 43 డిగ్రీల మార్కును చేరాయి. అదికూడా సీజన్ మొత్తంలో గరిష్ఠంగా ఒకటి లేదా రెండు రోజులు మాత్రమే ఆ స్థాయి ఉష్ణోగ్రతలు నమోదైనట్లు రికార్డుల ద్వారా తెలుస్తున్నది. కానీ ఈ వేసవిలో మాత్రం కరోనా తరువాత ఈ స్థాయి ఉష్ణోగ్రతలు నమోదవ్వడమే కాకుండా ఇప్పటి వరకు రెండు సార్లు గరిష్ఠ ఉష్ణోగ్రతలు 43డిగ్రీల మార్క్‌ను చేరాయి. అంతేకాకుండా నగర చరిత్రలోనే మొదటిసారిగా ఈనెల 3న పగటి ఉష్ణోగ్రతలు 43డిగ్రీలు దాటి నమోదవ్వడం కొత్త రికార్డుగా చెప్పవచ్చు. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 43.6డిగ్రీల సెల్సియస్, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 27.1డిగ్రీల సెల్సియస్, గాలిలో తేమ 14శాతంగా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. అయితే ఒక పక్క పగటి ఉష్ణోగ్రతలు అనూహ్యంగా పెరుగుతుండగా మరో పక్క గాలిలో తేమ శాతం కిందకు పడిపోతున్నది. గాలిలో తేమ శాతం అతి తక్కువకు పడిపోవడం వల్ల పొడిగాలి ఏర్పడి, తీవ్రమైన ఉక్కపోత ఏర్పడుతుంది. హైదరాబాద్‌లోనే గాలిలో తేమ అత్యల్పంగా 14శాతం నమోదుకావడం కూడా ర